పెన్ పవర్
తెలంగాణ రౌండప్
మంగళవారం 25 నవంబర్ 2025 పేజీలు 8

# ప్రభుత్వ చేతకానితనంతో రూ.3000 కోట్లు ఆగిపోయాయి

- రెండేళ్లుగా ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని అరుణ విమర్శ
- కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికల హడావుడి అని ఎద్దేవా
- ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తున్నారని ఫైర్



హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ప్రజలకు చేసిందేమీ లేదని, అన్ని వర్గాలను మోసం చేసిందని పాలమూరు ఎంపీ డీకే అరుణ తీవ్రంగా విమర్శించారు.

-2 లో



## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం...


# ప్రభుత్వ దృఢ సంకల్పం

- ఎక్సైజ్ శాఖ బలోపేతం.. రాష్ట్రంలో 14 కొత్త అబ్కారీ పోలీస్ స్టేషన్లు..
- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 24:** డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములై ముందుకు రావాలని శాసన మండలి సభ్యులు ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.. సోమవారం మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్, నాచారం, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన కాప్రా ఆబ్కారీ (ఎక్సైజ్) పోలీస్ స్టేషన్లను ఆయన ప్రారంభించారు.. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి, ఎక్సైజ్ ఈఎస్ నవీన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖను మరింత శక్తివంతం చేయడానికి ప్రభుత్వం 14 కొత్త అబ్కారీ పోలీస్ స్టేషన్లను మంజూరు చేసిందని, వాటి ద్వారా మత్తు పదార్థాల నియంత్రణలో కనీసం ఏ లోటూ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్త స్టేషన్లకు అవసరమైన స్థలాలను సమకూర్చి, వాటికి శాశ్వత భవనాల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నివేదిస్తామని అన్నారు.. గంజాయి, డ్రగ్స్ రహిత తెలంగాణ సాధన కోసం ఎక్సైజ్ వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరమని, ఈ మత్తు పదార్థాల ముఠాలను సమూలంగా నిర్మూలించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మద్యం అక్రమ రవాణా, కల్తీ మద్యం తయారీ%-%రవాణా నివారణ కోసం ప్రభుత్వం అన్ని విధాల కఠిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు.. ఎక్సైజ్ శాఖ అధికారులు నిరంతరం క్రమశిక్షణతో పనిచేసి డ్రగ్స్ గంజాయి వ్యాపారాన్ని అరికట్టాలని సూచించారు. కొత్తగా మంజూరైన అబ్కారీ స్టేషన్ల భవనాల కోసం స్థలాలు, నిర్మాణ నిధులు త్వరితగతిన మంజూరు జరుగేలా సీఎం తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండేందుకు పెద్ద స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని, వారిని చైతన్యవంతులను చేసే దిశగా ఎక్సైజ్ శాఖ కృషి చేయాలని అన్నారు.




# హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాలపై ఎస్ఓటీ ఉక్కుపాదం



- హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయాలపై పోలీసుల స్పెషల్ డ్రైవ్
- ఒకేసారి 8 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసిన మాదాపూర్ ఎస్ఓటీ
- న్యూ ఇయర్ వేడుకలే లక్ష్యంగా బెంగళూరు నుంచి డ్రగ్స్ సరఫరా
- నిందితుల నుంచి హెరాయిన్, ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తున్న

-2 లో

## ఇదంతా చేసింది రవి ఒక్కడే.. ముగిసిన కస్టడీ..

# చంచల్ గూడ జైలుకు..?

హైదరాబాద్ పెన్ పవర్: ఐబొమ్మ రవి ఐదు రోజుల కస్టడీ సోమవారంతో ముగిసింది. కస్టడీలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రవి ఒక్కడే పైరసీ చేసినట్టు సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులు




గుర్తించారు. సినిమాలను పైరసీ చేసి 5 ఏళ్లల్లో 100 కోట్ల రూపాయలు వరకు సంపాదించినట్టు తేల్చారు. 30 కోట్ల రూపాయలకు సంబంధించి బ్యాంకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా పైరసీ సినిమాలను కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. యాప్ ద్వారానే బేరమాడి సినిమాలను కొనుగోలు చేసి ఐబొమ్మలో అప్ లోడ్ చేసినట్లు తేలింది.

-2 లో

## భోజన నాణ్యతపై ఆగ్రహించిన విద్యార్థులు

## శ్రీ చైతన్య కాలేజ్లో ధర్నా

**ఖమ్మం: పెన్ పవర్:**ఖమ్మం జిల్లా హర్షా కాంప్లెక్స్లో ఉన్న శ్రీ చైతన్య కాలేజ్లో సోమవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. కాలేజ్ హాస్టల్ అందిస్తున్న భోజనం నాణ్యత బాగాలేదంటూ పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. విద్యార్థుల ప్రకారం, గత కొన్ని నెలలుగా క్యాంటిన్లో అందిస్తున్న భోజనం రుచిగా ఉండకపోవడం, తరచూ చల్లగా పెట్టడం, శుభ్రత లోపించడంపై పలు సార్లు ఫిర్యాదు చేసినా, కాలేజ్ యాజమాన్యం స్పందించలేదని ఆరోపించారు. “పొంగల్లో రాళ్లు, కూరల్లో పురుగులు, అన్నం సరిగా ఉడకడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా పరిష్కారం లేదు” అని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తమ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## యాదాద్రిలో ఎమ్మెల్యేల హల్ చల్

**యాదాద్రి: పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు వస్తుండటంతో.. ఎమ్మెల్యేలు ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో హడావుడి చేస్తున్నారు. ఈ క్రమంలో శిలాఫలకాలను ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు ఉన్నారు. శిలాఫలకాలకు బదులు.. ఫ్లెక్సీలు కట్టి.. ప్రభుత్వ పథకాలను ప్రారంభోత్సవం చేశారు. ఫ్లెక్సీలను ఓపెన్ చేసి.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు సదరు నాయకులు. ఎన్నికల అప్పుడు వచ్చిన నాయకులు తిరిగి అభివృద్ధి పనుల పేరుతో హడావిడిగా గ్రామాల్లోకి రావడంతో రాజకీయంగా వేడందుతుంది. ఫ్లెక్సీలను కట్టి ప్రారంభోత్సవం చేయడం కొత్త విధానానికి నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారని ప్రతిపక్ష పార్టీ నాయకులు మండిపడుతున్నారు.

## మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆందోళన

**జగిత్యాల పెన్ పవర్:**జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఖిలగడ్డ వద్ద గల మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆందోళన చేపట్టారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రవి కుమార్ తమపై తిట్టిపోస్తూ, కొడుతున్నారంటూ 10వ తరగతి విద్యార్థులు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ క్షమాపణ చెప్పినప్పటికీ విద్యార్థులు నిరసన విరమించకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి వారిని క్లాస్రూమ్కి పంపించారు.

## కాంగ్రెస్ పార్టీ అంటే నే స్కాంగ్రెస్

**జగిత్యాల పెన్ పవర్:**జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మీడియాతో మాట్లాడారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రానికి ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ ముఖ్యమంత్రి గా ఉన్నాడు. రేవంత్ వల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కుప్పకూలింది. హైదరాబాద్ లో పరిశ్రమలు ఉన్న భూములను రియల్ ఎస్టేట్ భూములు గా మర్చి 5 లక్షల కోట్ల ప్రజల సొమ్మును ముఖ్యమంత్రి రేవంత్ కుటుంబం దోచుకుంటుంది. స్వాతంత్రం ముందు దేశాన్ని బ్రిటిష్ వాళ్ళు దోచారు ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రాష్ట్రాన్ని దోస్తున్నారని అన్నారు.

మహాత్మ గాంధీ ముందు చూపు తో స్వాతంత్రము తర్వాత కాంగ్రెస్ పార్టీ ని తీసెయ్యాలి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే నే స్కాంగ్రెస్.పరిశ్రమలకు సంబందించిన 10 వేల ఎకరాల భూములను రేవంత్ ప్రభుత్వం దోచుకుంటుంది. మంత్రి లక్ష్మణ్ తెలంగాణ భూముల ను కాపాడుకోవాల్సిన బాధ్యత మీ పైన కూడా ఉంది. మంత్రి గారు మీరు డిస్ట్రాక్ట్ కావద్దు. 5 లక్షల కోట్ల స్కాం వ్యవహారం పై బీజేపీ నాయకులు స్పందించాలని అన్నారు.

## ఇదంతా చేసింది రవి ఒక్కడే.. ముగిసిన కస్టడీ..

# చంచల్ గూడ జైలుకు..?

- మొదటి పేజి తరువాయి

యూఎస్‌డీ ద్వారా సినిమా అమ్మిన వాళ్లకు రవి చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. సినిమా చూడాలంటే తప్పనిసరిగా కాంటాక్ట్ యాక్సెస్ తీసుకుంటున్న రవి.. సినిమాపై క్లిక్ చేయగానే 15 యాడ్స్‌కు డైరెక్ట్ లింక్ చేశాడు. మ్యాట్రిమొనీ, బెట్టింగ్, గేమింగ్‌తో పాటు పలు యాడ్స్‌కు పైరసీ సినిమాలను లింక్ చేశాడు. ఏపీకే ఫైల్స్ లింక్స్ పంపి బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేశాడు. 50 లక్షల పైచిలుకు వ్యూయర్‌షిప్ చూపెట్టి పెద్ద ఎత్తున్న.. కోట్లలో సంపాదించాడు. ఇండియాలో ఉన్న ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కి నిధుల బదలాయింపు జరిపాడు. ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కి వచ్చిన నిధులను యూఎస్‌డీటీ ద్వారా మళ్లించుకున్నాడు. సినిమా పైరసీకి సంబంధించి ఐదు రోజులపాటు సీసీఎస్ పోలీస్ స్టేషన్?లో రవిని సీసీఎస్ పోలీసులు విచారించారు. ఐదు రోజుల విచారణలో రవి బ్యాంకు లావాదేవీలు.. పైరసీకి సంబంధించిన వివరాలపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. ఐదు రోజుల విచారణ ముగియడంతో వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి రవిని పోలీసులు తరలించారు. అనంతరం నాంపల్లి కోర్టులో రవిని జడ్జి ముందు హాజరు పర్చి చంచల్ గూడ జైలుకు ఐ బొమ్మ రవిని తరలించే అవకాశం ఉంది.

**ఐబొమ్మ రవి అడ్వకేట్ శ్రీనాథ్ ఏం చెప్పారంటే..**

ఐబొమ్మ రవి 5 రోజుల కస్టడీ ముగిసింది
కస్టడీలో కేవలం పోలీసులకు సహకరించలేదనేది అవాస్తవం
ఇమంది రవిపై మొత్తం 5 కేసులు నమోదు అయ్యాయి
ఒక్క కేసులో మాత్రమే రిమాండ్ విధించారు
మరో 4 కేసులో పిటి వారెంట్ కోసం పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు
రవి బెయిల్ పిటిషన్ వేశాము.. మంగళవారం బెయిల్ పిటిషన్?పై వాదనలు జరుగుతాయి.

# ప్రభుత్వ చేతకానితనంతో రూ.3000 కోట్లు ఆగిపోయాయి

- మొదటి పేజి తరువాయి

సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని ఆమె ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనం వల్లే కేంద్రం నుంచి రావాల్సిన రూ.3000 కోట్ల పంచాయతీ నిధులు ఆగిపోయాయని డీకే అరుణ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఎన్నికలు జరిగినప్పుడే కేంద్రం నేరుగా గ్రామాలకు నిధులు పంపిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ పక్షపాతం చూపిస్తున్నారని, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ పథకంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా ఉన్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.గత ప్రభుత్వం ఇష్టానుసారంగా మండలాలను ఏర్పాటు చేసిందని, జనాభా ప్రాతిపదికన మండలాలను పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో సరైన ప్రభుత్వ వైద్య సేవలు లేకపోవడం దారుణమన్నారు. చేనేత కార్మికులకు సబ్సిడీ రుణాలు అందించాలని, మహిళల కోసం జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ఈ మోసాలకు మహిళలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, సత్య యాదవ్, రతంగ్, లక్ష్మీకాంత్, కొండయ్య, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాలపై ఎస్ఓటీ ఉక్కుపాదం

- మొదటి పేజి తరువాయి

ముఠాలపై మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఒకేసారి మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 8 మంది డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా హెరాయిన్, ఎండీఎంఏ, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే... చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపినగర్ వద్ద బస్సులో డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను పక్కా సమాచారంతో పట్టుకున్నారు. బెంగళూరు నుంచి న్యూ ఇయర్ ఈవెంట్ల కోసం డ్రగ్స్ తీసుకువస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అలాగే నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4.5 గ్రాముల హెరాయిన్ అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిపిన దాడిలో 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి, నిందితులను విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# తిరుమలాయపాలెం మండలంలో "ఇందిరమ్మ చీరల" పంపిణీ ప్రారంభం.






**ఖమ్మం,పెన్ పవర్,నవంబర్ 24.** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి, ముజాహిద్ పురం గ్రామం గ్రామపంచాయతీ కార్యాలయం నందు సోమవారం 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమాన్ని తిరుమలాయపాలెం ఏపీఎం కలకోటి సంపత్ ప్రారంభించారు.అర్హత ఉన్న 18 ఏళ్లకు పైబడిన ప్రతి మహిళకు చీరలు అందించే విధంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గుర్తు చేస్తూ, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు ఆర్థిక బలం కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతి ఇంటికి



ఇందిరమ్మ సన్న బియ్యం, చేనేతతో నేసిన నాణ్యమైన చీరల పంపిణీ ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చుతో మురుగు నీటి సమస్యకు పైప్‌లైన్ ఏర్పాటు..గ్రామస్థుల ప్రశంసలు






**ఖమ్మం, పెన్ పవర్,నవంబర్ 24:**తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన కొత్తపల్లి రవి, కొత్తపల్లి వెంకన్న తండ్రి అబ్బురాములు,కొత్త మధు తండ్రి సుధాకర్ తమ స్వంత ఖర్చుతో గ్రామంలోని వారి ప్రాంతాలలో ఉన్న మురుగు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువచ్చారు. గ్రామపంచాయతీ నిధులు అందుబాటులో లేకపోవడంతో అధికారికంగా పనులు చేపట్టడం సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో స్థానికులు స్వయంకృషితో ప్రాంతాన్ని శు భ్రపరిచి భూమిలోపడి పైప్‌లైన్ అమర్చుతూ మురుగు ప్రవాహాన్ని సక్రమపరిచారు.ఈ చర్య వల్ల చెత్త నిల్వ, దుర్వాసన, దోమల సమస్యలు తగ్గి గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉపయుక్తమైంది. స్థానికులు, గ్రామ నేతలు ఈ స్వచ్ఛంద కార్యక్రమాన్ని అభినందిస్తూ, వారి కృషి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ ప్రయత్నం ద్వారా గ్రామంలో వారి వంతుగా కృషి చేస్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని ప్రాంతాలలో కూడా ప్రజల్లో స్వయంకృషి భావన పెంచుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు. పైప్‌లైన్ ఏర్పాటు గ్రామ జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో కీలక పాత్ర పోషించనుందని వారు తెలిపారు.

## మత్స్యశాఖ సహకార సంఘాలకు చేప పిల్లల పంపిణీ..




**ఖమ్మం,పెన్ పవర్, నవంబరు 24.**తిరుమలాయపాలెం మత్స్యశాఖ కార్మికుల బలోపేతం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం సోమవారం తిరుమలాయపాలెం మండలంలో నిర్వహించబడింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ సిలార్ సాహెబ్ చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల మత్స్యశాఖ సభ్యులు ఓరా వెంకటేశ్వర్లు, తురక వేణు, కృష్ణల ఆధ్వర్యంలో జల్లేపల్లి మత్స్యశాఖ సంఘానికి చేప పిల్లలను పంపిణీ చేశారు. చేప పిల్లల పంపిణీతో జల్లేపల్లి గ్రామంలోని చెరువులలో చేపల ఉత్పత్తి మరింత పెరుగుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఈ కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చేపల పెంపకాన్ని ఆధునిక విధానాలతో అభివృద్ధి చేయాలని ఎంపీడీవో సూచించారు. గ్రామంలోని మత్స్యకార కుటుంబాల ఆర్థిక పురోగతి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేయాలని సభ్యులు కోరారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహణ కోసం సిబ్బంది శ్రమించారు. అధికారులు చేపట్టిన పనితీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.ఈ కార్యక్రమంలో ఓరా వెంకటేశ్వర్లు తవడబోయిన కృష్ణ రామన బోయిన వెంకటేశ్వర్లు రామన బోయిన నరసయ్య జల్లేపల్లి మత్స్యశాఖ సభ్యులు చింతల వెంకన్న, దడిదల రమేష్, సంకరబోయిన యల్లయ్య, దడిదల అశోక్, పందిరి రమేష్, దువ్వ రాజబాబు, భద్రయ్య, మాల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## మంథని డిపో నుండి శబరీమల కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

హైదరాబాద్ పెన్ పవర్:టీజీఎస్ఆర్టీసీ టూర్ ప్యాకేజీ లో భాగంగా మంథని డిపో నుండి శబరీమల కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపనున్నట్లు మంథని డిపో మేనేజర్ వి.శ్రావణ్ కుమార్ సోమవారం తెలిపారు. మంథని నుండి బయలుదేరి హైదరాబాద్ -శ్రీశైలం- మహానంది-కాణిపాకం -పంబ చేరుకుని తిరుగు ప్రయాణంలో మదురై- రామేశ్వరం - తిరుపతి- విజయవాడ- వరంగల్- ద్వారా మంథని కి చేరుకుంటుందన్నారు. ఇట్టి ప్రయాణానికి గాను చార్జి ఒకరికి 6900 రూపాయలుగా నిర్ణయించడమైనదన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో బార్డర్ టాక్స్ మరియు పార్కింగ్ చార్జీలను బస్సు బుక్ చేసుకున్న వారే చెల్లించవలసి ఉంటుందని తెలిపినారు. ఒకే బృందంగా వచ్చి 35 సీట్లు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులకు ఇద్దరు వంట మనుషులు, ఇద్దరు మణికంఠ స్వాములు (10 సంవత్సరాల లోపు వారు) మరియు ఒక అటెండర్ కు సీటు లేకుండా ఉచిత ప్రయాణానికి అనుమతించబడునని తెలిపారు. కావున అయ్యప్ప స్వామి భక్తులు ఇట్టి సదావకాశాన్ని ఉపయోగించుకొని అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. బస్సు బుకింగ్ కొరకు 9959225923,9948671514 లేదా మంథని డిపో లో సంప్రదించగలరని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

**జగిత్యాల, నవంబర్ 24 పెన్ పవర్:**
:ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ లు, ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా



పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి.ఎస్ లత,బి.రాజగౌడ్, కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా

**జగిత్యాల, నవంబర్ 24 పెన్ పవర్:**
విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం ఇందిరా భవన్ లో విశ్రాంత ఉద్యోగస్తుల నూతన కార్యవర్గం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నూతన కార్యవర్గానికి శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి విశ్రాంత ఉద్యోగస్తుల సమస్యలు తెలిపారు.విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యలపై సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో విద్యార్థులు నిరుద్యోగ యువత ఉద్యోగస్తులు ఉపాధ్యాయులతో పాటుగా విశ్రాంత ఉద్యోగస్తులు కూడా ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆనాడు సకలజనుల సమ్మెలో భాగంగా యావత్ తెలంగాణ సమాజం రాజకీయాలకతీతంగా ఉద్యమించడం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోని ఉమ్మడి రాష్ట్రంలో మనం ఏమైతే ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నామన్నారు. మన రాష్ట్రం మనకు ఏర్పడ్డయితే మనం స్వరాష్ట్రంలో ఆశయాలు ఆకాంక్షలు హక్కులు సాధించుకునే అవకాశం ఉంటుందని తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకోవడం ఆనాడు చైర్ పర్సన్ సోనియా గాంధీ రాజకీయంగా ఒరిదుడుకులు ఎదుర్కొన్న గాని ఆంధ్రప్రదేశ్ లో పార్టీ ఉనికి కోల్పోతుందని ఊహించి కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చటం ప్రధాన బాధ్యతగా భావించి రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ కి దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి తెలంగాణ ఉద్యమ నాయకుడిగా ఆనాడు 2014లో కేసీఆర్ గారికి అవకాశం వచ్చిందన్నారు. దురదృష్టం



ఏమిటంటే విద్యార్థులు నిరుద్యోగ యువత వారి సమస్యలు సమస్యలుగానే ఉండిపోవడం ఉద్యోగస్తులు ఉపాధ్యాయుల సమస్యలు కానీ లేక విశ్రాంత ఉద్యోగస్తుల సమస్యలే కానీ సమస్యలు ఆశించిన మేరకు పరిష్కారం పొందలేకపోవడంతోని మార్పు కోరడం జరిగిందన్నారు.ఆ మార్పులు భాగంగా మొన్నటి శాసనసభ ఎన్నికలలో మీ అందరి మద్దతుతోని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం జరిగిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో ప్రధాన పాత్ర పోషించింది ఏ విధంగా విద్యార్థులు నిరుద్యోగ యువత ఉద్యోగస్తులు ఉపాధ్యాయులు ఉన్నారని, విశ్రాంతి ఉద్యోగస్తులది కూడా ప్రధాన పాత్ర విశ్రాంత ఉద్యోగస్తుల సమస్యలు వారు జీవితకాలం సేవలు అందించి వారి జీవితం చివరి అంకంలో వారి కుటుంబాన్ని స్థిరపరచుకోవాలని వెల్లడించారు. వారి బాధ్యతలు నిర్వహించుకోవాలనే తలంపు తోని వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఒక విధంగా వారికి లభించాల్సిన హక్కులన్నారు.సర్వీస్ కాలంలో సేవింగ్స్ గాని సౌకర్యాలు కానీ మీకు లభించాల్సి ఉంటుందన్నారు. గతానికి ఇప్పటికీ వ్యత్యాసం గతంలో మనకు పెన్షన్ నెలలో మొదటిరోజు పొందుతున్నమన్నారు. బ్యాంక్ ఇన్స్టాల్ మెంట్స్ ఇతర సమస్యలు తలెత్తకుండా గతంలో లాగా ఇబ్బంది కలగకుండా మొదటిరోజు ప్రభుత్వం ఇస్తుందన్నారు. దానితోపాటు మనకు రావలసిన ఏరియేస్ జీవితకాలం సర్వీస్ లో ఉండగా సేవింగ్ చేసుకున్నామో రిటైర్మెంట్ తోని పొందలేకపోతున్నమన్నారు.ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఆర్థిక ఇబ్బందులతోని వాయిదాల పద్ధతితోని సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.పిఆర్సి సర్వీస్ ఉద్యోగస్తులకు ఎంత ప్రధానమో విశ్రాంత ఉద్యోగస్తులకు కూడా పిఆర్సి అంతే ప్రధానం అని అన్నారు. పిఆర్సి జాప్యం కావడంతోని మనం ఆశించిన ఫలితం పొందలేకపోతున్న తప్పకుండా పిఆర్సి సాధ్యమైనంత తొందరలో నిర్ణయింప చేసే విదంగా కానీ మీకు రావాల్సిన మీ సేవింగ్స్ తరితగతలో వచ్చే విదంగా చేయడంలో కానీ ముఖ్యంగా మీరు కోరుకున్నట్టు ఆరోగ్య భద్రత రాజ్యాంగం కల్పించిన హక్క అని ఆయన అన్నారు. వైద్య సదుపాయాలకు సంబంధించి ఏ విధంగా నిరుపేద వర్గాలకు ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుందో విశ్రాంత ఉద్యోగస్తులకు కూడా ప్రభుత్వం ఆరోగ్య సేవలు అందించడం ప్రధానం అని, సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# అన్నదాత సుఖీభవ - ఇంటింటి ప్రచారం:-



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా బి వి జయనాగేశ్వర రెడ్డి దేశాల మేరకు గోనెగండ్ల పట్టణంలో ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం, ముఖ్యంగా అన్నదాత సుఖీభవ రెండు విడతలప్రయోజనాల గురంచి వివరంచి, వారి అభిప్రాయాలను తెలుసుకోని డోర్–టు–డోర్ ప్రచారం చేస్తూ లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ గోనెగండ్ల మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు,టౌన్ అధ్యక్షులు మహల్ రహంతుల్లా,జిల్లా మైనారిటీ అధికార ప్రతినిధి బేతల బడేసాబ్,క్లస్టర్ ఇంచార్జి రంగస్వామీ నాయుడు,శ్రీధర్ నాయుడు,మాజీ సర్పంచ్ రంగముని,బూత్ ఇంచార్జిలు NV బాబు నాయుడు,NV బాలకృష్ణ,ఐటీడీపి రాంపురం రఫీక్,PAC డైరెక్టర్ కడపల రమేష్ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.....

## మల్లనపేట జాతరకి వచ్చే భక్తులకు ఎలాంటి భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
జిల్లా లోని గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లనపేట గ్రామంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లికార్జున స్వామి (మల్లన్న పేట జాతర) సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. నవంబర్ 26 తేదీ నుండి డిసెంబర్ 17 వ తేదీ వరకు జరుగు జాతర సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాల్లో, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితులకు స్పందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.

ఎస్పీ వెంట డిఎస్పి రఘు చందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్,సి.ఐ రవి,ఎస్.ఐ కిషన్,సాగర్ రెడ్డి ఉన్నారు.

### వరంగల్ జిల్లా లోఘరానా మోసం

## సరికొత్త పెళ్లి మోసం

**పెళ్లి చేసుకుని నగలు, డబ్బుతో ఉడాయించిన యువతి**

**రూ.2 లక్షల నగదు, 8 తులాల బంగారంతో పరార్**



**వరంగల్: పెన్ పవర్:** ఒక యువతి పెళ్లి పేరిట వరుడిని మోసం చేసి పారిపోయిన ఘటన పర్వతగిరి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మ్యాట్రిమోనీ సైట్ ద్వారా విజయవాడకు చెందిన యువతి సంబంధం కుదిరింది. పెళ్లి అయిన తరువాత రెండు లక్షల నగదు, ఎనిమిది తులాల బంగారంలో యువతి పరారయింది. వరుడు యయువతి తల్లిదండ్రులు, బంధువులు అంతా ఫేక్ అని ఆలస్యంగా తెలుసుకున్నారు. గతంలో మరో ఇద్దరు యువకులను సైతం పెళ్లి పేరుతో మోసం చేసినట్లు గుర్తించారు.

## జమ్మికుంట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య పరికరాలు అందజేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:**తనుగుల వద్ద మానేరు వాగుపై చెక్ డ్యామ్ ధ్వంసం పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. డబ్బులు ఇచ్చుకో కాంటాక్ట్ తెచ్చుకో....ఇచ్చుకో పుచ్చుకో పద్ధతి కొనసాగుతుందని అన్నారు. బిఆర్ఎస్ కావాల్సింది పోస్టింగ్ లు, కాంగ్రెస్ కావాల్సిందే డబ్బులు. బిఆర్ఎస్ హయాంలో అవినీతి అక్రమాల్లో భాగస్వామ్యమైన వారికే కాంట్రాక్ట్ వర్కులు వస్తున్నాయని అయన అన్నారు.

కేంద్ర మంత్రి సోమవారం నాడు జమ్మికుంట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు పరికారలు అందచేసారు.

మంత్రి మట్లాడుతూ ప్రణాళిక లేకుండా చెక్ డ్యామ్ లు నిర్మించారు. అవి కూలిపోతుంటే ఎవరి మీద చర్య తీసుకోవాలి? అదే కాంట్రాక్టర్ వెళ్లి మళ్లీ పనులు తెచ్చుకుంటాడు. వాళ్ళే కాంట్రాక్టర్, అదే అధికారులు, వాళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు.

వాళ్ల సూచనల సలహాల మేరకు పనులు జరుగుతుండడంతో తెలంగాణ అధోగతి పాలవుతుంది. క్వాలిటీ లేకుండా పనులు చేస్తున్నారని గత సంవత్సరం నుంచి ఆరోపణ వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశు ద్ధి ఉంటే అవినీతికి వ్యతిరేకం అయితే కాంటాక్టర్ లతో సంబంధం లేదనుకుంటే సమగ్ర విచారణ జరిపించాలి. బాధ్యులైన కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెట్టి రికవరీ చేయాలి, ఆస్తులు జప్తు చేయాలనిఅ న్నారు.

రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఆసుపత్రులకు అందజేశానని అన్నారు.

# కంటి చూపు మెరుగుకు పిల్లలకు రోజూ వీటిని తినిపించండి..

**కళ్లద్దాలను వాడాల్సిన అవసరం ఉండదు..**

**హైదరాబాద్ పెన్ పవర్:**

పూర్వం ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే కంటి చూపు తగ్గేది. కానీ ప్రస్తుతం చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కంటి చూపు సమస్యతో బాధపడుతున్నారు. చిన్నారులు ఆ వయస్సు నుంచే కళ్లద్దాలను ధరించాల్సిన దుస్థితి నెలకొంది. అయితే కంటి చూపు సమస్యకు పోషకాహార లోపమే ప్రధాన కారణమని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు జంక్ ఫుడ్‌కు బాగా అలవాటు పడ్డారని, పోషకాలు ఉండే ఆహారాలను తీసుకోవడం లేదని, దీని వల్లే వారిలో కంటి చూపు మందగిస్తుందని అంటున్నారు. అయితే చిన్నారులకు ఇప్పటి నుంచే పోషకాలు ఉండే ఆహారాలను పెడితే దాంతో వారి కంటి చూపు మెరుగు పడడమే కాదు, వారు కళ్లద్దాలను వాడాల్సిన అవసరం తప్పుతుంది. అలాగే వారు పెద్దయ్యాక కూడా కంటి చూపు సమస్య రాదు. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అందుకు గాను వారికి రోజూ కొన్ని ఆహారాలను ఇవ్వాల్సి ఉంటుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.




**క్యారెట్లు, ఆకుకూరలు..**

చిన్నారులకు రోజూ కచ్చితంగా ఒక క్యారెట్‌ను తినిపించాలి. వారు క్యారెట్‌ను నేరుగా తినకపోతే ఏదైనా ఇతర ఆహారాలతోపాటు కలిపి ఉడికించి పెట్టాలి. లేదా క్యారెట్ జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో వారిచే తాగించాలి. క్యారెట్లను వారికి రోజూ పెట్టడం వల్ల కావల్సినంత బీటా కెరోటిన్ లభిస్తుంది. ఇది శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. దీని వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. కంటి సమస్యలు తగ్గుతాయి. కళ్లు సురక్షితంగా ఉంటాయి. అలాగే చిన్నారులకు రోజూ బచ్చలికూర, పాలకూరను పెడుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. తోటకూర కూడా మేలు చేస్తుంది. కరివేపాకులు, కొత్తిమీర, పుదీనా వంటి ఆకులను కూడా పెట్టవచ్చు. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కళ్లను రక్షిస్తాయి. ఆకుకూరల్లో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కళ్లను రక్షించి కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. కనుక ఆయా ఆకుకూరలను రోజూ చిన్నారులకు పెడుతుంటే వారికి ఎంతో మేలు జరుగుతుంది.

**ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు..**

ఇక చిన్నారుల కంటి ఆరోగ్యానికి, కంటి చూపు మెరుగు పడేందుకు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కూడా మేలు చేస్తాయి. ఇవి ఎక్కువగా చేపలతోపాటు చియా విత్తనాలు, అవిసె గింజలు, వాల్ నట్స్, కోడిగుడ్లు, బాదంపప్పు వంటి ఆహారాల్లో ఉంటాయి. అందువల్ల వీటిని కూడా పిల్లలకు రోజూ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వారి కళ్లను ఆరోగ్యంగా ఉండేలా చేయవచ్చు. ఇక క్యాప్సికంను కూడా పిల్లలకు తరచూ పెడుతుండాలి. ఇందులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కళ్లలోని రక్త నాళాలకు మేలు చేస్తుంది. ఆయా రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా చూడవచ్చు. ముఖ్యంగా ఎరుపు రంగులో ఉండే క్యాప్సికంను తింటే మేలు జరుగుతుంది. దీని వల్ల విటమిన్ సితోపాటు విటమిన్ ఎ ను కూడా పొందవచ్చు. ఇవి రెండూ చిన్నారుల కళ్లను సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి.

**చిలగడదుంపలు, పైనాపిల్..**

చిలగడదుంపలను కూడా చిన్నారులకు తరచూ పెడుతుండాలి. వీటిల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. కంటి చూపు పెరిగేలా చేస్తుంది. ఈ దుంపలను తరచూ ఉడకబెట్టి వాటిపై కాస్త నెయ్యి వేసి చిన్నారులకు తినిపించాలి. దీని వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇక చిన్నారుల కంటి ఆరోగ్యం మెరుగు పడాలంటే వారికి పైనాపిల్ పండ్లను కూడా తరచూ తినిపించాలి. వీటిని తింటే కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా ఉంటాయి. కళ్లు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఇక చిన్నారుల కంటి చూపు మెరుగు పడేందుకు డ్రై యాప్రికాట్స్ కూడా మేలు చేస్తాయి. వీటిల్లో విటమిన్లు ఎ, సి, ఇ అధికంగా ఉంటాయి. ఇవి కంటి రెటీనాను రక్షిస్తాయి. కళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఇక చిన్నారుల కళ్ల ఆరోగ్యం కోసం వారికి తరచూ బెండకాయలను కూడా పెట్టాలి. అలాగే బ్రోకలీ, పర్పుల్ కలర్‌లో ఉండే క్యాబేజీ వంటి వాటిని కూడా పిల్లలకు తరచూ తినిపిస్తుండాలి. ఇవన్నీ వారి కళ్ల ఆరోగ్యాన్ని మెరుగు పరచడంతోపాటు కంటి చూపు పెరిగేలా చేస్తాయి. దీని వల్ల చిన్నారుల కళ్లు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

# రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులు రాక అనేక అవస్థలు

**హైదరాబాద్ పెన్ పవర్:**

రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులు రాక అనేక అవస్థలకు గురవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి భోజనం పెడుతున్నప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ముందు ఆందోళనకు దిగారు.రేవంత్ రెడ్డి సరఫరా చేసే బియ్యం మొత్తం ప్లాస్టిక్ లెక్క ఉంటున్నాయని నిజామాబాద్ జిల్లా వేంపూర్‌కు చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు తెలిపారు. పిల్లలకు ఏమన్న అయితే మమ్మల్నే అంటారు కదా అని ఆవేదన చెందారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద పిల్లలకు భోజనం కూడా ఈ ప్రభుత్వం సరిగ్గా పెట్టడం లేదని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు జీతాలు పెంచి, సమయానికి జీతాలు, బిల్లులు ఇచ్చిండని తెలిపారు. రేవంత్ రెడ్డి గత సంవత్సరం నుంచి జీతాలు, బిల్లులు ఇవ్వకపోవడంతో రూ.2లక్షల అప్పు చేసి, నా ఇల్లు తాకట్టు పెట్టి పిల్లలకు భోజనం పెడుతున్నానని పేర్కొన్నారు.పిల్లలకు వంట చేద్దామంటే వంట సామాన్లు ఇస్తలేరని.. తమకు జీతాలు కూడా ఇస్తలేరని నిర్మల్ నుంచి వచ్చి ధర్నాలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికురాలు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు పస్తులు ఉండొద్దని అప్పులు చేసి వంట సామాన్లు

కొని భోజనం పెడుతున్నామని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చే బియ్యం బాగోలేవని.. అన్నం అంతా గంజిలాగా అవుతుందని పేర్కొన్నారు. ఆ అన్నం పిల్లలు ఎవరూ తినడం లేదని తెలిపారు.రేవంత్ రెడ్డి పిల్లలకు పంపే బియ్యం మొత్తం రబ్బర్ లెక్క ఉంటున్నాయని నిజామాబాద్ జిల్లా వేంపూర్‌కు చెందినమధ్యాహ్న భోజన కార్మికురాలు తెలిపారు. పిల్లలు రెండు కూరలు పెట్టాలి, కోడిగుడ్డ పెట్టాలని జీవో విడుదల చేసి.. అసలు సామాన్లు పంపించడమే ఆపేసిండని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఇంట్లో కూడా పేద విద్యార్థులకు పంపించే నాసిరక వంట సామాన్లే వాడతారా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు మా బాధలు చెబితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని అంటున్నారని తెలిపారు. వెంటనే తమ జీతాలు పెంచి పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే పురుగుల మందు తాగి చనిపోతామని అన్నారు. వంట సామాన్ల కోసం షాపుల దగ్గరకు వెళ్తే, మధ్యాహ్న భోజన కార్మికులు వస్తున్నారని.. ఉచితంగా సామాన్లు అడుగుతారని భయపడుతున్నారని తెలిపారు. ఏసీలో కూర్చొని చూడటం కాదు..

దమ్ముంటే ఇక్కడికి వచ్చి మాట్లాడు అని సవాలు విసిరారు. 8 నెలల నుంచి మాకు జీతాలు లేవు.. సంవత్సరం నుంచి వంట సామాన్ల బిల్లులు లేవని మరో కార్మికురాలు తెలిపారు. మేం గెలిస్తే వంట మనుషుల జీతాలు పెంచుతామని మాటిచ్చి.. ఇప్పుడు కనీసం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పిల్లలకు భోజనం పెట్టడానికి మా పట్ట గొలుసులు కూడా అమ్మేసుకుంటున్నామని ఆవేదన చెందారు.కేసీఆర్ ఉన్నప్పుడు పిల్లలకు పొద్దున టిఫిన్ పెట్టి, సమయానికి బిల్లులు కూడా ఇచ్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి వచ్చాక 11 నెలలు టిఫిన్ పెట్టి బిల్లులు అడిగితే, కేసీఆర్ పెట్టిన పథకానికి మేమెందుకు బిల్లులు ఇస్తామంటున్నారని ఆవేదన చెందారు. 12 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా రేవంత్ రెడ్డి గోసపెడుతున్నారని అన్నారు.

# అర్ధరాత్రి పెట్రోలింగ్ వాహనంలో రౌడీ షీటర్ల ఇళ్లకు హైదరాబాద్ సీపీ సజ్జనర్

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, అర్ధరాత్రి పెట్రోలింగ్ వాహనంలో స్వయంగా గస్తీ నిర్వహించారు. సైరన్, ఎలాంటి ఆర్భాటం లేకుండా ఆ వాహనంలోనే లంగర్ హౌజ్ పీఎస్ పరిధిలోని ఎండీ లైన్స్, ఆశాం నగర్, డిఫెన్స్ కాలనీల్లోని రౌడీ షీటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లారు. ఇంట్లోనే ఉన్న రౌడీ షీటర్లను నిద్రలేపి%ఔ% వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు. మళ్లీ నేరాల వైపు అడుగు వేస్తే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. నేర ప్రవృత్తి వీడి సన్మార్గంలోకి రావాలని వారికి హితవు పలికారు. ఆదివారం అర్ధరాత్రి సౌత్ వెస్ట్ జోన్‌లో నగర సీపీ వీసీ సజ్జనర్, ఆకస్మిక పర్యటన చేశారు. రాత్రి 12:00 గంటల నుండి 3:00 గంటల వరకు లంగర్ హౌస్, టోలిచౌకి పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులు, కీలక ప్రాంతాలు, సున్నితమైన పాయింట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. టోలిచౌకి పరిధిలో రాత్రిపూట తెరిచి ఉన్న హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల్లోకి వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో షాపులు తెరిచి ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. పెట్రోలింగ్ సిబ్బంది ఎంత మేర అప్రమత్తంగా ఉన్నారు, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే అంశాలపై క్షేత్రస్థాయిలో నేరుగా ఆరా తీశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళు , అధికారులను స్వయంగా కలుసుకుని, గస్తీ



పాయింట్లు, స్పందన వేగం, సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం.. టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి.. స్టేషన్ జనరల్ డైరీ, రాత్రి చేసిన ఎంట్రీలు, డ్యూటీలో ఉన్న సిబ్బంది హాజరు వివరాలు, వారికి అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, మాట్లాడుతూ%ఔ% రాత్రి వేళల్లో పోలిసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలా స్పందిస్తున్నారన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. పీపుల్ వెల్ఫేర్ పోలిసింగ్‌లో భాగంగా చేపడుతున్న ఈ పర్యటనలు సిబ్బంది బాధ్యతా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సేవల నాణ్యతను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు.

విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించిన ఆయన, నగరంలో నేరాలపై కఠినమైన పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి సమస్యకు వెంటనే స్పందించే విధంగా బృందాలు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు.

# హైదరాబాద్కు భారీగా డ్రగ్స్ చెక్ పెట్టిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** డ్రగ్స్ విక్రయాలపై ఎస్ఓటీ మాదాపూర్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఒకేసారి 3 పోలీస్టేషన్ల పరిధిలో ఎనిమిది మంది డ్రగ్ పెడ్లర్లు అరెస్ట్ అయ్యారు. నార్సింగి, చందానగర్ , కొల్లూర్ లిమిట్స్లో డ్రగ్స్ విక్రయాలు చేస్తున్న పెడ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నార్సింగి పరిధిలో 4.5 గ్రాముల హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరిని ఆరెస్ట్ చేశారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధి గోపినగర్ వద్ద బస్సులో డ్రగ్స్ను తీసుకు వస్తున్న ముఠాను పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ముగ్గురిని మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల %వీణహీూ%, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ ముఠా బెంగళూరు నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. న్యూ ఇయర్ ఈవెంట్స్ను టార్గెట్గా పెట్టుకొని డ్రగ్స్ను



హైదరాబాద్కు తీసుకువస్తోంది ముఠా. మొత్తం ముగ్గురు సభ్యుల ముఠాను మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చందాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే కొల్లూరు పోలీస్టేషన్ పరిధిలో 42 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

## కూంబింగ్ ఆపండి...ఆ తేదీ ప్రకటిస్తాం

### మూడు రాష్ట్రాల సీఎంలకు మావోయిస్టుల లేఖ

### ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** వరుస ఎదురు కాల్పులు, అగ్ర నేతల లొంగుబాటులతో కుదేలయిన మావోయిపస్టు పార్టు ఆయుధ విరమణపై కీలక ప్రకటన చేసింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, మహారాష్ట్రాల ముఖ్యమంత్రులకు బహిరంగ లేఖ రాసింది. మూడు రాష్ట్రాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధ విరమణపై తేదీని ప్రకటిస్తామని లేఖలో పేర్కొంది. ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే అప్పటి నుంచి ఆయుధాలను వదిలేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బస్వరాజు ఎన్కౌంటర్ తర్వాత పార్టీ పునర్నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించి ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని లేఖలో పేర్కొంది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు సమాచారం ఇచ్చినట్టు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది.

## అంధుల మహిళా క్రికెట్ టీంను అభినందిచిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**అంధుల క్రికెట్ మహిళల టీ20 ప్రపంచ కప్)లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిన భారత అంధ మహిళల క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నేపాల్లో జరిగిన ప్రపంచ కప్ పోటీల్లో భారత జట్టు ప్రదర్శించిన అసాధారణ ప్రతిభ, పట్టుదల, స్ఫూర్తిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ విజయం దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందన్నారు. ధైర్యం, క్రమశిక్షణ, అజేయమైన స్ఫూర్తి ఉంటే కంటి చూపు లేకున్నా రాణించవచ్చని అంధ మహిళల క్రికెట్ జట్టు మరోసారి నిరూపించిందన్నారు.

## నూతన సీజేఐకు శుభాకాంక్షలు తెలియచేసిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**న్యూఢిల్లీ లోని రాష్ట్రపతి భవన్లో భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి కి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి పదవీ కాలం విశిష్టంగా, ప్రభావవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## రాజారాంపల్లిలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

### పాల్గోన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్ పెన్ పవర్:

ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఇందిరా మహిళా శక్తి చీరలను రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేసారు. మంత్రి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా బతుకమ్మ పేరుతో పంట పొలాలకు కట్టే చీరలు తాము ఇవ్వడం లేదని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరమ్మ పేరు మీద నాణ్యమైన చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. బిఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారు. మహిళల ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది. ప్రజలు అన్ని గమనిస్తున్నారు.. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు.

## కొడంగల్ బంద్

హైదరాబాద్ పెన్ పవర్:కొడంగల్ మండలంలో జరిగే రేవంత్ రెడ్డి బహిరంగ సభకు వెళ్లకుండా నిరసన తెలియజేయాలని కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం నాడు పలు వ్యాపార సముదాయలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కడంగల్ మండల కేంద్రం నుండి మెడికల్ కళాశాల, వెటర్నరీ, నర్సింగ్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాలలను దుద్యాల మండలానికి తరలింపును నిరసిస్తూ బంద్ పిలుపునిచ్చారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో కారు బోల్తా

హైదరాబాద్ పెన్ పవర్:తిరుమల కొండపై నుంచి తిరుపతికి వస్తున్న ఓ కారు బ్రేకులు ఫెయిల్ కావడంతో మొదటి ఘాట్ రోడ్డులో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది.సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన నలుగురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదానికి గురైన వాహనానికి ముందు వెనుక వాహనాలు లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు వివరించారు. కారును అధికారులు తిరుపతికి తరలించారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి




హైదరాబాద్ పెన్ పవర్:బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అధికారులకు ఆదేశించారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పీ తెలిపారు.

## ధర్మేంద్రను కోల్పోవడం చలన చిత్ర రంగానికి తీరని లోటు

హైదరాబాద్ పెన్ పవర్:భారతీయ చలనచిత్ర రంగంలో రారాజుగా వెలుగొందిన నటుడు శ్రీ ధర్మేంద్ర గారి మరణం చాలా బాధాకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సందేశంలో పేర్కొన్నారు. సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించిన విలక్షణ నటుడు ధర్మేంద్ర ని కోల్పోవడం చలనచిత్ర రంగానికి తీరని లోటు అని అన్నారు. ధర్మేంద్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో లయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, వారి అభిమానులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని, తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.

## 2027 జనాభా గణనకు సిద్ధం..! మిమ్మల్ని అడిగే ప్రశ్నలు ఇవే..!

హైదరాబాద్ పెన్ పవర్:
కొత్త ఏడాది 2027 జనాభా గణన ప్రారంభం కాబోతున్నది. ఎన్యుమరేటర్లు ఇండ్లకు చేరుకొని సమాచారం సేకరించారు. సర్వేయర్లంతా మీ ఇంటి నిర్మాణం నుంచి దాని ఉపయోగం వరకు ప్రతిదాని సమాచారం సేకరించనున్నారు. ఉదాహరణకు సౌరశక్తి నుంచి ఇంటర్నెట్ వినియోగం వరకు ప్రతిదానిపై సమాచారాన్ని కోరనున్నారు. ఇంటి నేల, పైకప్పు, గోడలు దేనితో తయారు చేస్తారు? ఇల్లు నివాసంగా ఉపయోగిస్తున్నారా? కార్యాలయమా..? గెస్ట్‌హౌసా? ప్రార్థన స్థలం కూడా ఉందా?.. కాలువ, నది, బావి, చేతిపంపు, నల్లాల ద్వారా నీరు అందుతుందా? ప్యాకేజ్డ్, సీసాల్లో నీటిని ఉపయోగిస్తారా? అనే సమాచారాన్ని సేకరించనున్నారు. అలాగే, టెలిఫోన్లు, స్మార్ట్‌ఫోన్ల గురించిన సమాచారం కూడా సేకరించనున్నారు. దీని ఉద్దేశం కేవలం దేశ ప్రజల జీవన ప్రమాణాలు అర్థం చేసుకోవడమే. డేటా అభివృద్ధి చెందిన భారత ప్రచారంలో కొత్త విధానాలను రూపొందించడంలో, ఇప్పటికే ఉన్న విధానాల్లోని లోపాలను సరిదిద్దడంలో సహాయపడనున్నది. 2027 జనాభా లెక్కల మొదటి దశ కోసం గృహాల జాబితా, గృహాల గణన షెడ్యూల్ జాబితాను తయారు చేసే ప్రచారాన్ని కేంద్రం ముమ్మరం చేసింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగనుండగా.. ఇందు కోసం 30కిపైగా ప్రశ్నల జాబితా సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో జారీ చేయనున్నారు. ఇంటి యజమాని నుంచి ఇంట్లో ఉన్న కారు, మోటార్ సైకిల్, సైకిల్, మోపెడ్ గురించిన సమాచారం సేకరిస్తారు. ఇంట్లో వంట చేయడానికి ఏమి ఉపయోగిస్తున్నారు? కలప, పంట వ్యర్థాలు, పిడకలు, బొగ్గు, గోబర్ గ్యాస్, కిరసనాయిల్, ఎల్‌పీజీ, పీఎన్‌జీ, సోలార్ ఎనర్జీ ఇలా ఏం వాడుతున్నారో తెలుసుకొని రికార్డు చేయనున్నారు. టీవీ, ల్యాప్‌టాప్, ల్యాండ్‌లైన్, మొబైల్ ఫోన్‌లలో డిష్, డీటీహెచ్ వినియోగిస్తున్నా ఆ సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే గోధుమ, జొన్న, బియ్యం, మిల్లెట్, మొక్కజొన్న వాడకం గురించి కూడా ప్రశ్నలు ఉంటాయి.2027 జనాభా లెక్కల మొదటి దశ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో ఇళ్ల వివరాలు, అందులో నివసించే ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయో తెలుసుకోనున్నారు. ప్రస్తుతం, లడఖ్, పశ్చిమ బెంగాల్ మినహా దేశవ్యాప్తంగా తొలిదశ సర్వే కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయి. ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి డేటాను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయనున్నారు. తొలిసారిగా డిజిటలైజ్ చేస్తుండడం వల్ల జనాభా గణన డేటా త్వరలోనే అందుబాటులోకి రానున్నది. గతంలో జనాభా గణన వివరాలు వేగంగా అందుబాటులోకి వచ్చినా.. వివరణాత్మక డేటా వచ్చేందుకు చాలా సంవత్సరాలు పట్టేది. రెండో దశలో 2027లో దేశవ్యాప్తంగా జనాభా గణన ఉంటుంది. ఇందులో కుల గణన కూడా ఉంటుంది. స్వాతంత్ర్యం తర్వాత జనాభా గణనలో మొబైల్ యాప్స్, పోర్టల్స్‌ను ఉపయోగిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఉంటాయి. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ ఆఫీస్ ఆఫ్ ఇండియా అన్ని రాష్ట్రాలకు వివరణాత్మక సూచనలను పంపింది.

## పోలీస్ కమిషనర్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"

కార్యక్రమంలో "69" ఫిర్యాదులు.

ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం




హైదరాబాద్ పెన్ పవర్:ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 13.00 గంటల వరకు ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుంది.ఈ నేపథ్యంలో ఈ రోజు ది.24.11.2025వ తేదిన పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి , "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 69 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడమైనది. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు, ఆస్తి వివాధాలకు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 31, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 06, కొట్లాటకు సంబంధించినవి 03, వివిధ మోసాలకు సంబంధించినవి 04, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 05, దొంగతనాలకు సంబంధించి 04, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 16, మొత్తం 69 ఫిర్యాదులును స్వీకరించడం జరిగినది.

## రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

హైదరాబాద్ పెన్ పవర్:
రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని,విక్రయించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు త్వరితగతిన కొనుగోళ్ళు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.సోమవారం జిల్లాలోని ఎండపెల్లి మండలం కేంద్రం, తోపాటు గుల్లకోట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, వేగంగా కొనుగోలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ పరిస్థితిని ,తూకం విధానాన్ని ,17% తేమ శాతం నిర్వహణను మరియు కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యంపై ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం తప్పనిసరిగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్ళు చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా తక్షణమే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ అధికారులకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన బరువు యంత్రాల నిర్వహణ ,ధాన్యం కొనుగోళ్ళు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షిం చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరన్ ,ఎమ్మార్వో అనిల్, సంబంధిత అధికారులు, రైతులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## పర్ణశాల దగ్గర బీఆర్ఎస్ ధర్నా

భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:దుమ్ముగూడెం మండలంలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పర్ణశాల వద్ద ధర్నా చేపట్టారు. ఇసుక లారీల వలన రహదారుల ధ్వంసం పై భద్రాచలం నియోజకవర్గం కేంద్రంగా నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో భద్రాచలం-వాజెడు రహధారి దిగ్బంధించి లారీలను నిలిపి వేసారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు..ఇసుక లారీల వలన పాడైన రోడ్లని నిర్మించాలని డిమాండ్ చేసారు..ఈ సందర్భంగా రేగ కాంతారావు మాట్లాడుతూ ఏజెన్సీ లో ప్రకృతి ప్రసాదించిన సంపదను కొల్లగొడుతు జిల్లా కి చెందిన ముగ్గురు మంత్రులు, ముఖ్యమంత్రి కి జేబులు నింపుతున్నారని ఆరోపించారు. ఇసుక లారీలు వల్ల ధ్వంసమైన రోడ్లు వల్ల ఇక్కడ ప్రజలు అవస్థలు పడుతున్నా కూడ స్థానిక ఎమ్మెల్యే కి కనిపించడంలేదని అన్నారు. ,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లో ప్రజలే వీరికి తాగిన గుణపాఠం చెప్పాలని పజలకు పిలుపునిచ్చారు..

## కోదండరామ్ ను కలిసిన నవీన్ యాదవ్

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహించిన జి.వెంకటస్వామి , అంజయ్య, పీజేఆర్ స్ఫూర్తితో నవీన్ యాదవ్ పని చేయాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నూతనంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపొందిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ నాంపల్లి లోని జన సమితి కార్యాలయంలో కోదండరాం ను కలిసి గెలుపుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ ను కోదండరాం సన్మానించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కొత్త తరం నాయకత్వం అవసరం ఉందని , అందుకు నవీన్ యాదవ్ గెలుపు నాంది అని కోదండరాం అన్నారు. తన గెలుపుకు కృషి చేసిన జన సమితి నాయకులకు నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంతో తో పాటు నగర అభివృద్ధితో కృషి చేస్తానని అన్నారు. వెంకటస్వామి , పీజేఆర్ తరహాలో బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

## డబుల్ బెడ్ రూం పేరిట మోసం

సంగారెడ్డి: పెన్ పవర్:కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇప్పిస్తానని పేదలను నమ్మించి ఓ వ్యక్తి మోసం చేసాడని బాధితులు ఆరోపించారు. అమీన్ పూర్ మండలం కిష్టారెడ్డిపేట కు చెందిన బీహెచ్ఈఎల్ ఎంప్లాయి ప్రసన్న కుమార్ పై ఆరోపణలు చేసారు. జోష్ బ్రదర్ అనే మధ్యవర్తి ద్వారా ప్రసన్న కుమార్ పరిచయమయ్యాడు. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 3 లక్షల నుంచి నాలుగైదు లక్షలు వసూలు చేశాడు. మొత్తం 69 మంది వద్ద నుంచి రూ. 2.50 కోట్లకు పైగా మోసం చేశాడని ఆరోపించారు. జోష్ అనే వ్యక్తి ద్వారా డబ్బులు ప్రసన్న కుమార్ తీసుకున్నాడు. - 2021 నుంచి నేడు, రేపు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పాడని ఆరోపించారు. కిష్టారెడ్డిపేట లోని ప్రసన్న కుమార్ ఇంటికి వెళ్తే వాచ్ మెన్ , కుక్కలతో దాడి చేయించాడని బాధితుల ఆవేదన. బాధితులు అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. జోష్ ను నిలదీయగా ప్రసన్న కుమార్ కే మొత్తం డబ్బులిచ్చానని చెబుతున్న వైనం. తమకు న్యాయం చేయాలని ప్రాధేయ పడుతున్నారు బాధితులు, మాకు డబుల్ బెడ్ రూం ఇవ్వకపోయినా సరే మా డబ్బులు మాకు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

# గౌరవెల్లి సహా.. తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వండి

హైదరాబాద్ పెన్ పవర్:

తెలంగాణలో గౌరవెల్లి సహా ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని..కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శి తన్మయికుమార్‌ను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సెక్రెటరీ కోఆర్డినేషన్ డా.గౌరవ్ ఉప్పల్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్.. ఢిల్లీలో తన్మయికుమార్‌ను కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన అనుమతులపై చర్చించారు.

సుప్రీంకోర్టు ధర్మాసనం మే 2025లో ఇచ్చిన,వనశక్తి తీర్పును ఇటీవల వెనక్కి తీసుకుందని. దీనిపై న్యాయసలహా తీసుకొని..అనుమతుల మంజూరు చేస్తామని తన్మయికుమార్ చెప్పినట్టు మంత్రి వివరించారు. ప్రాజెక్టులకు త్వరగా



అనుమతులు మంజూరు చేస్తే. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని కార్యదర్శికి వివరించినట్టు మంత్రి తెలిపారు. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ విదేశాల్లో ఉన్న కారణంగా. తన్మయికుమార్‌ను కలిసి ప్రాజెక్టుల అనుమతుల గురించి చర్చించినట్టు చెప్పారు.

# కారుకు ప్రమాదం

హైదరాబాద్ పెన్ పవర్:

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మరో విషాదం చోటుచేసుకుంది. ఓఆర్ఆర్‌పై ఓ కారులో మంటలు చెలరేగి నిమిషాల్లోనే దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. శామీర్‌పేట సమీపంలో ఓఆర్ఆర్‌పై వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు నుంచి బయట పడేందుకు వీలులేక పోవడంతో డ్రైవర్ మంటల్లో సజీవ దహనం అయ్యాడు. కారు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఆదివారం విషాదకర సంఘటన చోటు చేసుకుంది. ఇంటిపై తీసుకున్న హెూం లోన్ చెల్లించాలంటూ ప్రైవేట్ బ్యాంకు, ఫైనాన్స్ నిర్వాహకుల నుండి తీవ్ర ఒత్తిడి ఎదురవ్వడంతో మనస్తాపానికి గురైన వరలక్ష్మి (35) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు ఎనరెల్లి కృష్ణ భార్య. కృష్ణ కూలి పనులు చేసేవాడు. వరలక్ష్మి ఒక క్లాత్ స్టోర్‌లో పనిచేసేది.కొన్ని నెలల కిందట కృష్ణ, వరలక్ష్మి దంపతులు తమ ఇంటిపై ఒక ప్రైవేట్ బ్యాంకులో, ఇతర ఫైనాన్స్ కంపెనీలలోలోన్ తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారు గడువులోపు ఈఎంఐలను చెల్లించలేకపోయారు. ఆదివారం ఉదయం, బ్యాంకు, ఫైనాన్స్ నిర్వాహకులు ఇంటికి వచ్చి, బకాయిలు పూర్తిగా చెల్లించాల్సిందేనని చెప్పారు. లేకపోతే నోటీసులిచ్చి ఇంటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వరలక్ష్మి, తూప్రాన్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై మృతురాలి భర్త కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తగ్గిన బంగారం ధర

హైదరాబాద్ పెన్ పవర్:

పసిడి ప్రియులకు ఈ సోమవారం పండగలాంటి వార్త అందింది. బంగారం కొనాలని చూస్తున్న వారికి ఇది ఒక గొప్ప శుభవార్త. మార్కెట్లు తెరుచున్న వెంటనే బంగారం ధర భారీగా తగ్గింది. 24 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాముపై 71 రూపాయలు, 22క్యారెట్ల బంగారం ఒక గ్రాముపై 65 రూపాయలు, 18 క్యారెట్ల బంగారం ఒక గ్రాము 53 రూపాయల చొప్పున దిగివచ్చింది. దీంతో దేశీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ. 1,25,130 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాము రూ. 1,14,700 పలుకుతుండగా, 18 క్యారెట్ల బంగారం ధర 10





గ్రాములు రూ. 93850 లకు చేరింది. గోల్డ్ లవర్స్‌కి ఈ తగ్గిన ధరలు నిజంగానే కాస్త ఊరటనిస్తాయని చెప్పాలి.ఇదిలా ఉంటే, పసిడి బాటలో వెండి కూడా పయనించింది. వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. వెండి గ్రాము ధర రూపాయి తగ్గి రూ.171లకు చేరింది. దీంతో కేజీ వెండి ధర రూ.1,71,000 ధర పలుకుతోంది.నవంబర్ 24 సోమవారం హైదరాబాద్ సహా విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర తులానికి రూ.710 తగ్గి రూ.1,25,130 పలుకుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.650 తగ్గింది. దీంతో 10గ్రాముల ధర రూ.1,14,700 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.530 తగ్గి రూ.93,850 పలుకుతోంది.